**కథ**

# శిక్ష

డాక్టర్ సంధ్యాదేవి చెప్పిన మాట వినగానే యశోద గుండె పగిలినట్టయింది. ఇదెలా సంభవం?

''డాక్టర్! మీరు సరిగా పరీక్షించారా? పొరపాటు కాదుగదా?'' దుఃఖం ంగుకొస్తుండగా అడిగింది.

''పొరపాటు ఎందుకవుతుంది. నా పరీక్షలో లోపముండదు'' కొంచెం చికాకుగా అంది సంధ్యాదేవి.

''క్షమించండి డాక్టర్! ఈ పిల్ల నోరులేనిది. చదువు లేనిది. తెలివితేటలు లేనిది. అందుకే ఇంట్లోనే వుంచి కంటికి రెప్పలా చూసుకుంటాను. బయటకు ఎట్టి పరిస్థితిలోనూ పంపను. అటువంటప్పుడు...''

''ఇంట్లోనే అత్యాచారం జరిగి వుండొచ్చు'' కచ్చితంగా చెప్పేసి ఇంకో పేషెంట్‌ని చూసేందుకు వెళ్ళింది సంధ్యాదేవి.

తోటకూర కాడలా వేళ్ళాడిపోతున్న అశ్వినిని ఆటోలో తీసుకుని ఇంటికి చేరింది యశోద. 'ఈ మూగపిల్లకి ఇంత అన్యాయం చేసిందెవరు? అదెలా జరిగింది?' అంతుచిక్కలేదు యశోదకు.

యశోదకు ఇద్దరు కూతుళ్ళు. పెద్దకూతురు నళిని. చిన్న కూతురు అశ్విని. బంగారు ప్రతిమలా వుంటుంది. అశ్విని పుట్టిన రెండేళ్ళకే భర్త చనిపోయాడు. టీచర్‌గా చేస్తున్న యశోదకు ఇద్దరి పిల్లలని పెంచడం భారమే అయింది.

నళిని తెలివైనది. ధైర్యం గలది.

అశ్వనికి అందమిచ్చిన దేవుడు నోరివ్వలేదు. తెలివితేటలు అంతకన్నా లేవు. మానసిక ఎదుగుదల లేనిది.

నళిని చదువులో చురుకైనది. అయినా డిగ్రీతో చదువు ఆపించింది యశోద. ఇంకా పై చదువు తన శక్తికి మించింది గనుక.

రెండు సంవత్సరాల క్రితమే నళినికి పెళ్ళి చేసింది. కూతురు, అల్లుడు ఆ ఊర్లోనే వుంటారు. అప్పుడప్పుడూ వచ్చి వెళ్తుంటారు. అశ్విని కోసం సీత అనే అమ్మాయిని ఎప్పుడూ ఇంట్లో వుండేటట్టు పెట్టుకుంది యశోద. తన ఆర్థిక పరిస్థితికి మించిన ఖర్చు అయినప్పటికీ, తను స్కూల్‌కి వెళ్ళినప్పుడు అశ్వినిని అన్నివిధాలా చూసుకోవడానికి ఒక మనిషి అవసరం గనుక, నమ్మకమైన సీతని పెట్టుకోక తప్పలేదు. సీత చాలా సహనం గలది పేరుకి తగినట్టు. అశ్విని పెద్దయినా కూడా పసిపాపలా చూసుకుంటోంది. స్వంత బిడ్డని సాకినట్టు అన్నీ చేస్తుంది. తను లేని సమయంలో, అశ్వినిని వదలి ఎట్టి పరిస్థితిలోనూ ఎక్కడికీ వెళ్ళదు సీత. సీత మీద అంత నమ్మకం యశోదకు. మరి ఇదెలా జరిగింది?

అశ్విని తనకి జీవితాంతం సమస్యే. తను గతిస్తే ఈ పిల్ల ఏమవుతుంది అన్న ప్రశ్న యశోదను అనుక్షణం వేధిస్తుంటుంది. ఇప్పుడు ఈ దుస్థితి కూడా నా బ్రతుక్కీ, దీని బ్రతుక్కీ అనుకుంటూ కుమిలిపోతూంది.

అశ్వనికి రెండురోజుల నుండి నలతగా వుండి వాంతులవుతుంటే పైత్యం చేసిందేమో అనుకుంది. నీరసపడిపోతూందని డాక్టర్ దగ్గరకు తీసికెళితే ఆవిడ పిడుగు లాంటి మాట చెప్పింది.

నెమ్మదిగా, లాలనగా అడిగి రాబట్టాలనుకుంది ఆ వెధవ ఎవరో? ఎలా అడగడం? మూగపిల్ల నుండి విషయం ఎలా రాబట్టడం? గుండెలు పగిలిపోతున్నాయి. సమయానికి సీత కూడా లేదు. వాళ్ళ ఊరు వెళ్ళింది తల్లికి సుస్తీ అంటే. అందుకే తను లీవ్ పెట్టింది అశ్విని కోసం. సీత వుంటే కొంత ఆధారం దొరికేదేమో?

వేయవలసిన ప్రశ్నలన్నీ వేసింది అశ్వినిని. నోరు లేని పిల్ల! 'వా,వా,వా!' అనడం, గుండెల మీద చెయ్యి వేసుకుని భయపడటం తప్ప ఏమీ సూచనగానైనా తెలియచేయలేకపోతూంది. వాడెవడో తన పేరు తెలియనివ్వద్దని బాగా భయపెట్టినట్టు అర్థమయింది యశోదకు.

''నీకేం భయంలేదు. నిన్నేమీ అనను'' గుండెలకు అదుముకుంది యశోద ఏడుస్తూ కూతుర్ని. తల్లి దుఃఖం చూసి తనూ ఏడ్చింది అశ్విని. తల్లిని వదలి గబగబా బీరువా దగ్గరకు నడిచింది. తాళం తీసి ఆల్బంలన్నీ తిరగేసింది. యశోద నిశ్చేష్ట అయి కూతురి చేష్టలని చూస్తూంది. దీనికి మతి పోలేదు గదా? ఇప్పుడు ఇవన్నీ ఎందుకు అని విస్తుపోయింది.

అశ్విని ఆల్బమ్స్ తిరగేసి ఒకచోట చూపు నిలిపింది. తల్లి దగ్గరకు వచ్చి ఒక ఫోటోలో వ్యక్తిని చూపుడు వేలుతో తట్టి చూపింది. అశ్విని కళ్ళల్లో క్రోధం కనిపిస్తోంది.

ఆ ఫోటోని చూడగానే యశోద అదిరిపడింది. అంతకుముందు కలిగిన బాధకన్నా ఇప్పుడు వేయి రెట్లు అధికమయింది. గుండెల్లో బాధ అగ్నిగుండం రగులుతున్నట్టుంది. ఆవేశంలో గుండెలు ఎగసి పడ్తున్నాయి.

ఇప్పుడు నా కనులముందు వాడుంటే పీక పిసికి చంపేద్దును అనుకుంది. 'పిచ్చిదానా! ఆవేశం అనర్థానికి దారితీస్తుంది' అంతరాత్మ హెచ్చరించింది. 'అవును నిజమే!' అనుకుంది యశోద. తనలాంటి దిక్కుమాలిన ఒంటరిదానికి ఆవేశం తగదు. సర్దిచెప్పుకుంది మనసుకి. దిక్కుమాలిన ఒంటరిదాన్ని అనుకునేటప్పటికి దుఃఖం వెల్లువలా పొంగింది. 'ఏనాటి పాప ఫలమో అనుభవించడానికి నేను మిగిలాను' అనుకుంది.

భర్త గుర్తుకు వచ్చాడు. 'మీరు అదృష్టవంతులు. అందుకే బాధలకీ, బాధ్యతలకీ దూరంగా దేవుని సన్నిధికి చేరుకున్నారు' అనుకుంది. తల్లి దుఃఖిస్తుంటే అశ్విని బావురుమంది.

'ఏడవద్దు' అన్నట్టు సైగ చేసింది. గబగబా కళ్ళు తుడుకుంది యశోద. ''ఏడవనమ్మా! నీకోసం అన్నీ దిగమింగుకుంటాను'' కూతురి కన్నీళ్ళు తుడిచి గుండెలకు హత్తుకుంది.

'పిచ్చిపిల్ల! తనకి ఎంతటి అన్యాయం జరిగిందో, దాని ఫలితం ఏమిటో ఊహించలేని పసిపాప లాంటిది. దీనిపైనా ఇంత అఘాయిత్యం? పాపాత్ముడా నిన్ను వదలను' అనుకుంది దృఢనిశ్చయంతో.

★ ★ ★

నళిని, భర్త రమేష్‌తో వచ్చింది యశోద ఇంటికి.

''ఎందుకమ్మా అంత అర్జంటుగా రమ్మని కంగారుగా ఫోన్ చేశావ్. అశ్విని బాగుందా?'' ఆత్రంగా అడిగింది తల్లిని నళిని.

''ఎంత బాగుందో నువ్వే చూసిరా. ఆ గదిలో పడుకుంది''

నళిని వెళ్ళబోయింది.

''దాన్ని డిస్టర్బ్ చేయకు. చూసిరా అంతే''

నళిని వెళ్ళింది లోపలి గదిలోకి. రమేష్ పేపరు తిరగేస్తూ కూర్చున్నాడు.

చెల్లెలిని చూసివచ్చిన నళిని ఏడుపు గొంతుతో ''అదేమిటమ్మా! అది అలా అయిపోయింది?'' అని తల్లిని అడిగింది.

''అందుకే గదమ్మా ఇంత అర్జెంటుగా మిమ్మల్ని రప్పించాను''

''డాక్టర్‌కి చూపించలేదా?''

''ఎందుకు చూపించలేదు. వాంతులైతే పైత్యమనుకుని ముందు ఊరుకున్నాను. నీరసపడిపోతూంటే




తీసికెళ్ళి చూపించాను''

''మరేమి సుస్తీ అటు?''

''సుస్తీ కాదు. అది నెలతప్పింది!''

''ఆ!'' ఆపై నోట మాటరాలేదు నళినికి.

పేపర్ చూస్తున్న రమేష్ అదిరిపడ్డాడా మ ఎకి. షాక్ అయిన నళిని ఇంకా తేరుకోనేలేదు. నిశ్శబ్ద ఆవ రించింది కొంతసేపు.

''అమ్మా! నేను నమ్మలేకపోతున్నానమ్మా ఇలా జరగడానికి ఏమాత్రం అవకాశముండదుగా సీత దాన్ని వదలి ఎక్కడికీ వెళ్ళదుగా?''

''అదే నాకూ అర్థం కావడంలేదు. ఆలో చగా ఆలోచించగా నాకనిపించింది మనం ఇద్దరం మామయ్య కూతురి పెళ్ళికి వెళ్ళినప్పుడు జరిగి వుండాలని. అప్పుడైనా సీత దాన్ని వదలి ఎక్కడికీ వెళ్ళదు. మరేమిటో అంతా అయోమయంగా వుంది'' దుఃఖంతో చెప్పింది యశోద.

రమేష్ చాలా ఇబ్బందిగా ఫీలయి ''అలా బయట కెళ్ళి వస్తాను'' అని లేవబోయాడు.

''కూర్చో బాబూ! నువ్వుండడం ముఖ్యం. ఆడ

**ఎ. స్నేహలత**

వాళ్ళం. దీనికి పరిష్కార మార్గం నువ్వే చెప్పాలి. అల్లుడివైనా, కొడుకువైనా నువ్వేనని నమ్మాను'' వెక్కి వెక్కి ఏడ్చింది యశోద.

''మీరుండండి. అమ్మ అలా బాధపడ్తుంటే వెళ్తానంటారేం?'' నళిని మాటలకి కూర్చుండిపోయాడు రమేష్.

''అమ్మా! ఆ వెధవన్నర వెధవ ఎవరో, ఏమైనా చెప్పగలిగిందా అశ్విని?''

''అది నోటితో చెప్పగలిగితే ఇంకేం?''

''మరెలా? ఎలా తెలుస్తుంది?''

''తెలిస్తే ఏం చేస్తావ్?''

''వెధవని కోర్టు కీడ్చి తగిన శిక్ష పడేలా చేస్తాను'' ఆవేశంగా అంది నళిని.

''వాడికి శిక్ష పడితే నీ చెల్లెలికి న్యాయం జరుగుతుందా?''

''అవును. జరగదు. వాడికిచ్చి పెళ్ళి చేయడమే తగిన శిక్ష''

''పెళ్ళైన వాడైతే?''

''రెండో భార్యగా చేసుకుంటాడు చేసిన తప్పుకి''

''వ హాటలంత తేలిక కాదు చేతలు''

''వాడిని మనం తెలుసుకోవాలేగాని ఊరికే వదలను. వాడి అంతం చూస్తాను. నోరులేనిదాన్ని, పసిపాప లాంటిదాన్ని ఈ స్థితికి తెచ్చినవాడిని వదలకూడదు. నెమ్మదిగా, ఎలాగైనా అశ్విని నుండి వాడెవడో రాబట్టాలి. దాన్ని కొంత కోలుకోనీయ్... మీరేంటండీ మాట్లాడరు ఏం పట్టనట్లు?''

రమేష్ నోరు మెదపకముందే యశోద అంది ''అతనేం మాట్లాడతాడమ్మా! కొంచెం ఫ్యాన్ వెయ్యి. అల్లుడిగారికెలా చెమటలు పడ్తున్నాయో!''

''ఇప్పుడు చెమటలేమిటండీ?'' అని ఫ్యాన్

ఏమైంది నళిని.

రమేష్ కర్చీఫ్‌తో ముఖం, మెడకి పట్టిన చెమటని తుడుచుకున్నాడు.

"ఏం చేద్దామమ్మా?" దిగులుగా అడిగింది నళిని.

"చెయ్యడానికేముంది? దానికింత విషమిచ్చి, నేనింత మింగితే ఏ సమస్యా ఉండదు"

"ఎందుకమ్మా అలా మాట్లాడుతావ్. జీవితంలో ఒంటరి పోరాటం సలిపావ్. ఇంత ధైర్యంగా నన్ను పెంచావ్. నా నరనరాల్లో ధైర్యాన్ని నూరిపోసినదానివి నువ్వు, ఈనాడిలా బేలగా పిరికిగా మాట్లాడుతున్నావా?"

"ఏం చెయ్యను తల్లీ! పరిస్థితి ఇలా వచ్చింది నాకున్న బాధలు చాలకా"

"మీరేమిటండీ? ఏం చెప్పరేమిటి?

"ఏం చెప్పను? గప్‌చిప్‌గా ఎబార్షన్ చేయిస్తే సరి, పరువు పోకముందే"

ఆ మాటలకి తల్లీకూతుళ్ళిద్దరూ తీక్షణంగా చూశారతని వంక.

"ఎంతబాగా చెప్పారు? పరువు పోవడానికి అది తెలిసి చేసిన తప్పా?"

"అడిగావు. నాకు తోచింది చెప్పాను"

"మీ బోడి సలహాలు ఎవరూ పాటించక్కర్లేదు"

ఆ తల్లీకూతుళ్ళిద్దరినీ చూస్తుంటే రక్తసంహారానికి సంసిద్ధమైన కాళికామాత ఇద్దరై అవతరించిందా? అనిపించింది రమేష్‌కి.

"అమ్మా! దాన్ని బుజ్జగించి వాడెవరో తెలుసుకోగలుగుతామేమో చూద్దాం పద!"

"అక్కర్లేదు" యశోద అంది.

"అదేమిటి?"

"నోటితోనూ, సైగలతోనూ చెప్పలేపోయింది గాని చూపించిందిలే!"

"చూపించిందా?" ఆశ్చర్యపోయింది నళిని.

"అవును.. ఆల్బంలో!" ప్రక్కనే రెడీగా పెట్టుకున్న ఆల్బంని తెరచి ఆ వ్యక్తిని చూపించింది యశోద.

నళిని 'ఆ!' అంటూ ఆశ్చర్యపోవడం, దిగ్గున కుర్చీలోంచి లేవడం "ఛీ! నీచుడా నువ్వా?" అంటూ రమేష్ చెంప పగలగొట్టడం రెప్పపాటులో జరిగిపోయాయి. ఇంకా నాలుగు తగలనిచ్చేదేమో, తల్లి వెనక్కి లాగింది. రమేష్ తల వాలిపోయింది. నోట మాట రాలేదు. రెండు ఆడపులుల మధ్య ఇరుక్కుపోయానే అనుకున్నాడు.

"ఇది నీకు న్యాయమనిపించిందా బాబూ?" యశోద ఏడుస్తూ అడిగింది.

"నన్ను క్షమించండి" నోరు పెగల్చుకుని అనగలిగాడు.

"అమ్మా! నీ అల్లుడికి మొదటినుండీ అశ్వని మీద మోజేనని ఇప్పుడర్థమయింది. 'నీ చెల్లెలు నీకంటే బాగుంటుంది. మూగదైపోయిందిగాని లేకపోతే తననే చేసుకునేవాడిని' అని అంటుండేవారు. నేను అంతగా పట్టించుకోలేదు. తన మోజు తీర్చుకోవడం కోసం అభం శుభం తెలియనిదాన్ని ఇలా చేశారా? అసలు ఎప్పుడు, ఎలా చేయగలిగారు చెప్పండి" కోర్టులో ముద్దాయిని అడిగినట్టు అడిగింది నళిని.

సిగ్గుతో అంతా చెప్పాడు.

"మీరిద్దరూ వూరు వెళ్ళినప్పుడే. అవసరం లేకపోయినా కొన్ని వస్తువులు తెమ్మని సీతను బజారుకు వెళ్ళమన్నాను. అశ్వనిని వదలి వెళ్ళనన్నా దబాయించి పంపాను" తల భూమిలోకి దిగబడిందా అన్నంతగా దించుకుని చెప్పాడు.

"అశ్వనిని బాగా భయపెట్టారుగదూ?" గద్దించి అడిగింది.

"అవును. ఈ విషయం ఎవరికైనా తెలియజేస్తే చంపేస్తానని బెదిరించాను" నళిని తీక్షణమైన చూపులకు గజగజలాడిపోయాడు రమేష్.

"నళినీ! నాది తప్పే. నన్ను క్షమించు" వేడుకున్నాడు.

"మీరు చేసిన తప్పుకు క్షమించడం కాదు, శిక్షించడమే సరైన న్యాయం"

హడలిపోయాడు రమేష్. "అంటే?"

"అశ్వనిని మీరు వెంటనే పెళ్ళి చేసుకోవాలి"

"నేనా?"

"అవును. మీరు చేసుకుని తీరాలి"

"మూగదానినా?"

"షటప్" నళిని అరుపునకు గది మారుమ్రోగింది. యశోద ఇంక తన పాత్ర ఏమీ లేనట్టు మౌనంగా దుఃఖిస్తూ కూర్చుంది.

"అమ్మా నాన్నలని అడగకుండానా? వాళ్ళు ఒప్పుకుంటారా?" దీనంగా అడిగాడు రమేష్.

"ఏమిటీ! మీ అమ్మానాన్నల అంగీకారం కావలసి వచ్చిందా మీకు? వాళ్ళనడిగి, అనుమతి తీసుకుని చేశారా ఈ తప్పు?"

"వాళ్ళకి నేను సమాధానం చెప్పగలను. వాళ్ళు కూడా ఇలాగే, మీలాగే తలదించుకునేటట్టు చేయగలను. ఆడపిల్ల జీవితం అంటే అంత చులకనా మీ మగ వెధవలకి"

ఒక్కో మాట భార్య అంటుంటే ఒక్కో వాత ఒంటిమీద పెట్టినట్టుంది రమేష్‌కు.

"నోరులేనిది బయటపడదులే అనుకుని వుంటారు పాపం! బెదిరించాను గదా అన్న ధైర్యం మీకు. పాపం దాగదు అన్న సత్యం తెలియదు మీకు. తెలిసినా, ముగ్గురూ ఆడవాళ్ళు ఏం చెయ్యగలరులే అన్న ధీమా!"

యశోద కుమిలి కుమిలి ఏడవడం తప్ప ఏం మాట్లాడలేకపోతూంది.

"ఎందుకమ్మా ఏడుస్తావ్? ఎంత తెలివైనదానివి, ముందుగా చెప్తే, నా భర్త అన్న పక్షపాతంతో సరైన న్యాయం చెప్పననుకున్నావా? నాచేత తీర్పు చెప్పించి తెలివిగా బయటపెట్టావా దోషిని. చెల్లెలి సమస్యను పరిష్కరించాల్సిన బాధ్యత నాకుండదనుకున్నావా? అంత స్వార్థపరురాలిననుకున్నావా అమ్మా!" నళిని ఏడుస్తూ తల్లి చేతులు పట్టుకుంది.

తర్వాత స్థిరనిశ్చయంతో అంది "అమ్మా! అశ్వని నా యింట్లోనే, నా సవతిగానే వుంటుంది. దానికి ఏ కష్టమూ రాకుండా చూసుకునే బాధ్యత నాది. నీకే బెంగా అక్కర్లేదు. ఈయనకిదే సరైన శిక్ష. క్షమించాలట! క్షమిస్తే తీరిపోయే సమస్యా ఇది" ఉగ్రరూపంతో చూసింది భర్త వంక.

"పెళ్ళై రెండు సంవత్సరాలైనా నాకు పిల్లలు పుట్టలేదని దెప్పుతున్నారుగా. మీ అమ్మా, నాన్నలిప్పుడు బాగా సంతోషిస్తారులెండి వంశాంకురం రాబోతూందని!" ఈ ఎగతాళి మాటలకి ఇంకా తల వాలిపోయింది రమేష్‌కి.

"చెప్పండి. ఈ శిక్ష అంగీకారమేనా? లేకపోతే పోలీస్ రిపోర్ట్ ఇవ్వాలా?"

హడలిపోయాడు రమేష్.

"మగవాడి అన్యాయాల్ని దిగమింగుకుని భరించడానికి పూర్వకాలం రోజులు కావు. తరాలు మారుతున్నాయి. ఆడవాళ్ళని తక్కువగా అంచనా వేసే కుసంస్కారం మీ మగజాతి మానుకోవాలి. మైండిట్!... పోలీస్ రిపోర్ట్ ఇవ్వడం ఖాయం. నీకు నేను డైవోర్స్ ఇవ్వను. నీ ఇంట్లోనే వుంటాను కానీ నీ భార్యగా కాదు"

తప్పు చేసినవాడికి శిక్ష తప్పదన్న సత్యం తెలుసుకున్న అతను తలవంచక తప్పలేదు.

★

